# ఆ తొమ్మండుగురు ఎక్కడ?

# (లూకా 17:11-19)

మన దినాల్లో ఉన్న గొప్ప అవసరతలలో ఒకటేమంటే - కృతజ్ఞత. మనం బహుగా దీవించబడ్డాం గాని, మన దీవెన మనదేయన్నట్టు భావిస్తాం. ''దేవుడు సృజించిన ప్రతి వస్తువును మంచిది. కృతజ్ఞతాస్తుతులు చెల్లించి పుచ్చుకొనినయెడల ఏదియు నిషేధింపతగినది కాదు'' (1తిమోతి 4:4). అని అపొస్తలుడైన పౌలు వ్రాశాడు. ''అందువలన మనము నిశ్చలమైన రాజ్యమును పొంది, దైవ కృప కలిగియుందము. ఆ కృప కలిగి వినయ భయభక్తులతో (కృతజ్ఞతతో) దేవునికి ప్రీతికరమైన సేవ చేయుదము. '' అని హెబ్రీయుల లేఖికుడన్నాడు (హెబ్రీ. 12:28-29). కొలస్సీ. 2:7 ప్రకారం మనం ''కృతజ్ఞతాస్తుతులు చెల్లించుటయందు విస్తరించుచు'' లేక పొర్లి పారునట్టి కృతజ్ఞతగలవారమై యుండాలి. గనుక యథార్థంగా, ఈ పాఠం హృదయాన్నిరేపి, మనస్సాక్షిని గుచ్చ నుద్దేశింపబడినంతగా, మనస్సుకు బోధ కలిగించాలని ఉద్దేశింపబడలేదు. (అంటే, కేవలం సంగతి వివరించడం దీని ఉద్దేశంకాదు)

### ప్రభువు వారి దినాల్లో కృతఘ్నత (మేలు మరచుట)

''ఆయన యెరూషలేమునకు ప్రయాణమైపోవుచు'' అని లూకా17 అంటుంది (11a వ.). ''ఆయన యెరూషలేమునకు పోవుచు[1]'' అని లూకాలో ప్రయోగింప బడింది; యిది మూడవసారి. సిలువ ఆసన్నమౌతున్న సమయమది. ఆయన, ''సమరయ గలిలయల మధ్యగా వెళ్లుచుండెను'' (11b వ.). ''యేసు సమరయ గలిలయ తీరప్రాంతంలో'' ప్రయాణం చేస్తున్నట్టు NIV అంటుంది. అంటే, యేసు పశ్చిమంగా యొర్దాను నది వైపుకు ప్రయాణం చేస్తున్నట్టున్నారు. ''ఆయన యొక గ్రామములోనికి వెళ్లుచుండగా'' (12a వ.). ఆ గ్రామం పేరేమో లూకా చెప్పలేదు; అది అంత ప్రాముఖ్యమయింది కాదు.

ప్రభువు ఆ గ్రామంలో ప్రవేశించే సమయంలో, ''పదిమంది కుష్ఠరోగులు

ఆయనకు ఎదురుగా వచ్చి దూరమున నిలిచి'' (12b వ.) కుష్ఠరోగులు గ్రామంలోగాని (పట్టణంలోగాని) ప్రవేశింప కూడదు. అయితే వారు భిక్షమడగడానికి[2], పురద్వారాల యొద్దకు రావచ్చు. ప్రభువు ఆ ఊరిలో ప్రవేశింపకముందు ఆ కుష్ఠరోగులు ఆ ఊరి గవినియొద్ద ఉన్నట్లున్నారు. కనీసం వారిలో ఒకడు సమరయుడు (16 వ.). ప్రభువు తరువాత పలికిన మాటలను బట్టి, మిగిలిన వారందరు దాదాపు యూదులైయుంటారు (18 వ.). యూదులు - సమరయులు అనే ఈ నరశత్రువులను[3] దుఃఖకరమైన పరిస్థితులే ఒక చోటుకు తెచ్చాయి. వరద నీరు పైకుబికినప్పుడు, తోడేలు గొర్రెపిల్లలు చిన్న దీవులవంటి పొడినేలలో గుమికూడినట్టే వారి కలయిక కనబడుతుంది.

ఈ సంఘటనను పూర్ణంగా అభినందించాలంటే - ఈ పదిమందికున్న రోగమెట్టిదో మనం తెలిసికోవాలి. కుష్ఠరోగమని బైబిలు పిలిచే ఈ వ్యాధి భయంకరమైన అంటువ్యాధి[4]. ఈ వ్యాధి చూడడానికే అసహ్యం పుట్టించేదని- దాన్ని గూర్చి చదివిన వారంటారు. మొదటిగా ఈ వ్యాధి మనిషియొక్క చర్మపురంగును మార్చుతుందట. మొదట అది గులాబిరంగుకు- తరువాత గోధుమ వర్ణానికి, ఆ తరువాత నలుపురంగుకు చర్మం మారుతుందట. అటు పిమ్మట - అది చర్మాన్ని, ఎముకలను కొల్లగొట్టి, పచ్చిపుండ్లు, గాయాలుగా మార్చి మనిషిని నాశనం చేస్తుందట. రెండు సంవత్సరాలలో మరణం తప్పదట (కుష్ఠరోగాన్ని గూర్చి యిది ఈ రచయిత యొక్క అభిప్రాయం).

పదిమంది అంటరానివారు వ్రేళ్ళులేని ముంజేతులను లేక ముంజేతులులేని చేతులను ఎత్తుతున్నట్టు నీ మనస్సులో ఆలోచించు. కండ్లూ, చెవులు లేక ముక్కులు పోయి ఉండవచ్చు. వారు రోతగా, వికారంగా, జీవితంలో పరాజితులుగా (ఓడింప బడినవారుగా) సమాజానికి అవసరం లేనివారుగా ఉన్నారు. కుటుంబాలు, ఉద్యోగాలు, వగైరాలు లేని స్థితిలో వారున్నారు. కుష్ఠరోగం శక్తిహీనంగా అవమాన కరంగా ఉంటుంది.

వారు ''దూరమున నిలిచి'' యున్నట్టు 12వ వచనం సూచిస్తుంది. కుష్ఠరోగులు దూరంగా నిలవాలనే చట్టమంది. అయితే వారెంత దూరంలో ఉండాలో అన్నసంగతిని ధర్మశాస్త్రం సూచింపలేదు గాని, వారు ఏభై అంగల దూరంలో నిలవాలని ఒక రబ్బీ సిఫారసు చేశాడు. అది రమారమి 50 గజాల దూరం - ఫుట్‌బాల్ కోర్టులో సగం పొడవంత దూరం - అంటే చాలా దూరమన్నమాట!!

ఈ పదిమంది కుష్ఠరోగులు యేసును చూచినప్పుడు - వారు తమ స్వరము లెత్తారు (13a వ.). ఆ రోగం యొక్క స్వభావం వారి స్వరనాళాలను కూడా తాకింది. క్షయ ఎక్కువగా ఈ జబ్బుతో కలిసియుంటుందట. గొంతు రాపెక్కి కఠినంగా మారిపోయింది. ఇక్కడ పదిమంది ఏభై గజాల దూరంలో ఉండి, ప్రభువుయొక్క శ్రద్ధను రాబట్టడానికి పాడైన గొంతులతో కేక వేస్తున్నారు. ''- యేసు ప్రభువా, మమ్ము

కరుణించుమని కేకలు వేసిరి'' (13b వ.). వారు స్వస్థత పొందగోరారనే దానిలో సందేహంలేదు. అయితే వారు ప్రత్యేకించి దయ, కనికరం కొరకు మనవి చేసికొన్నారు. వారి దేహాలకు స్వస్థత మాత్రమే కాకుండ, వారి మనస్సుకు, ఆత్మకు కూడా స్వస్థత కావాలని కోరారు.

''ఆయన వారిని చూచి ... వారితో చెప్పెను'' (14 వ.). ప్రభువైన యేసు జనుల శబ్దంతో చుట్టబడియుండవచ్చు. ఒకవేళ ఆయన వారిని మొదట వినకపోయి ఉండవచ్చు. ఆయన విన్నప్పుడు, చుట్టూ కలయజూచి, వారు దూరంగా ఉన్నట్టు గుర్తించియుండవచ్చు. ''మీరు వెళ్లి, మిమ్మును యాజకులకు కనపరచుకొనుడని ఆయన వారితో చెప్పెను'' (14b వ.).

ఇంతకముందు, ప్రభువైన యేసు మరొక కుష్ఠరోగిని బాగుచేశారు. ఆ సందర్భంలో, ఆయన అతని ముట్టి ''శుద్ధుడవుకమ్ము' అని పలికారు (లూకా 5:13). ధర్మశాస్త్రం ఆజ్ఞాపించినట్టు నీవు వెళ్లి యాజకులకు కనుపరచుకొమ్మని ప్రభువు అతనికి చెప్పారు. యాజకులు ఆరోగ్యాన్ని తనికీ చేసేవారుగా పనిచేస్తుండేవారు. కుష్ఠరోగి శుద్ధుడైనట్టు యాజకుడు నిర్ణయిస్తే, అతడు కొన్నిరకాలైన అర్పణలు అర్పించి, తిరిగి సమాజంలో చేరవచ్చు. అతడు తన కుటుంబంతో ఉండేలా యింటికి వెళ్లవచ్చు, తిరిగి తన ఉద్యోగానికి, దేవాలయానికి వెళ్లవచ్చు.

అయితే, ఈసారి, ఆ కుష్ఠరోగులను ముట్టడానికిగాని, ఉన్నపాటునే వారిని బాగుచేయడానికిగాని ప్రభువు వారి చెంతకు వెళ్లలేదు. వారు బాగుపడియున్నట్టే, వెళ్లి తమ్మును యాజకులకు కనుపరచుకొమ్మని చెప్పి, విశ్వాసపు పరీక్షతో ఆయన వారిని సవ్వాలు చేశారు. (ఈ సంభవం జరిగిన స్థలాన్నిగూర్చి NIV చెప్పేది నిజమైయుంటే; అది గలిలయ, సమరయలకు మధ్య సరిహద్దు గనుక - యెరూషలేము వెళ్లడానికి ఆ పదిమంది కుష్ఠరోగులు చాల దూరం ప్రయాణం చేయవలసి యుంటుంది!).

ఈ సంభవంలోని తరువాత భాగం పులకరింపజేస్తుంది గమనించు. ''వారు వెళ్లుచుండగా, శుద్ధులైరి'' (14c వ.). సమరయుడు తిరిగివచ్చి ప్రభువును కనుగొనగలిగినందున, వారు స్వస్థత పొందేలోపు ఎక్కువ దూరం వెళ్లలేదని నేను ఊహిస్తున్నాను, వారి కండ్లు, చెవులు, గొంతు బాగుపడినప్పుడు, పాత కురుపులు పోయి చర్మం ఆరోగ్యంగా మారినప్పుడు, క్రొత్త ఎముకలు వాటిమీద కండరాలు, నరాలతో క్రొత్త చర్మం కప్పబడినప్పుడు - శక్తి తమ శరీరాల్లో ప్రవహించుతున్నప్పుడు వారి భావన ఎలాగుండి యుంటుందో ఊహించి చూడు! వారి హృదయాలు ఎలాటి ఆనందంతో ఉప్పొంగి యుండేవో! ''నేను శుద్ధుడనయ్యాను!'' నేను తిరిగి యింటికి వెళ్లగలను! నేను సమాజంలోనికి ప్రవేశింపగలను! దేవాలయంలోనికి కూడా వెళ్లగలనని వారు సంతోషించియుంటారు!!

ఆ పదిమంది మధ్యనున్న పోలికలను చూడు: 1. అందరూ ఆ భయంకరమైన వ్యాధితో ఉన్నవారే. 2. దాని విషయమై ఏదైనా చేయాలనే అందరు తీర్మానించు కున్నారు. 3. ప్రభువైన యేసు ఏదోవిధంగా తమకు సహాయం చేయగలరని వారందరూ నమ్మారు. 4. అందరూ ప్రభువును వేడుకొన్నారు. 5. అందరూ ఆయన మాటకు విధేయులై యాజకులున్న చోటికి వెళ్ల నారంభించారు. 6. అందరు స్వస్థత పొందారు. అక్కడ పోలిక నిలిచిపోతుంది. ''వారిలో ఒకడు'' అంటూ 15వ వచనం ప్రారంభవౌతుంది. కొద్దిసేపటిలో యితడు సమరయుడని కూడా మనం తెలిసికొంటాం. ''వారిలో ఒకడు తనకు స్వస్థత కలుగుట చూచి ... తిరిగివచ్చి ... '' (15a వ.). ప్రభువు ఆజ్ఞాపించినో ప్రయాణం తరువాత చేశాడనేది నిస్సందేహం. ఏది ఎలాగున్న, అతడు మొదటిగా తనలో పొర్లిపారే తన కృతజ్ఞతను తెలియజేయ గోరాడు.

అతడు ''దేవుని మహిమపరచుచు తిరిగి'' వచ్చాడు (15b వ.), దేవుడు ప్రభువైన యేసుకు స్వస్థపరచగల శక్తి నిచ్చినట్లు అతడు గ్రహించాడు. అతడు ''గొప్ప శబ్దముతో దేవుని మహిమపరచాడు'' (15c వ.). కుష్ఠరోగి వాని రాపెక్కిన గొంతుతోకాక, స్వస్థపరచబడిన మనిషియొక్క బలమైన గొంతుతో! ''తిరిగి వచ్చి ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, ఆయన పాదములయొద్ద సాగిలపడెను'' (16a వ.). ప్రభువైన యేసుయొక్క దైవత్వాన్ని గుర్తించి, ఆయన పాదముల యొద్దపడి ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించాడు. ''కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచూ'' అనే ప్రయోగం స్వస్థపరచ బడినవాడు ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుతునే ఉన్నట్లు- వర్తమాన కాలాన్ని సూచిస్తుంది.

ఆ తరువాత వచ్చే కురుచైన ప్రతిపాదన - ''వాడు సమరయుడు'' అనేది బహుగా దిగ్భ్రాంతిని కలిగించే సమాచారమే (16b వ.). అనేక మార్లు ఎదురుచూచేవారి యొద్దనుండి కృతజ్ఞత ఉండదు. వారు మన ప్రయాసలను మామూలుగానే తీసికొంటారు. అయితే మనం ఎవరి యొద్దనుండి ఎదురుచూడమో వారినుండే మనం ఎక్కువగా కృతజ్ఞతను పొందుతాం (ఇది నరుల మధ్య తరచుగా జరుగుతుంది).

17వ వచనంలో ప్రభువు వ్యక్తపరచిన దుఃఖాన్ని నీవు వినగలవా? ''అందుకు యేసు-పదిమంది శుద్ధులైరి కారా; ఆ తొమ్మండుగురు ఎక్కడ?'' వారందరు తిరిగి వచ్చి, ముందుగా సిద్ధపరచుకొని, కీర్తన 103ను ఒకేసారి కలిసి పాడాలని ఎవరైనా ఎదురుచూస్తారు!

> నా ప్రాణమా, యెహోవాను సన్నుతించుము.
> నా అంతరంగముననున్న సమస్తమా,
> ఆయన పరిశుద్ధ నామమును సన్నుతించుము.
> నా ప్రాణమా, యెహోవాను సన్నుతించుము

ఆయన చేసిన ఉపకారములలో దేనిని మరువకుము
ఆయన నీ దోషములన్నిటిని క్షమించువాడు
నీ సంకటములన్నిటిని కుదుర్చువాడు.
సమాధిలోనుండి నీ ప్రాణమును విమోచించుచున్నాడు
కరుణా కటాక్షములను నీకు కిరీటముగా ఉంచుచున్నాడు
పక్షిరాజు యౌవనమువలె నీ యౌవనము క్రొత్తదగుచుండునట్లు
మేలుతో నీ హృదయమును తృప్తిపరచుచున్నాడు
(1-5 వచనాలు) - అని వారు పాడియుండవలసింది!

కాని, వారలా చేయలేదు. ఎందువలనో? బర్‌టన్ కోఫ్‌మన్ అనే వ్యక్తి యథార్థతలేని వారి స్థితిని పరిహాస భావంతో యిలా సూచించాడు:

స్వస్థత నిజమైయ్యిందో కాదో చూడాలని ఒకడు ఆగాడు.
అది ఎక్కువ కాలం ఉంటుందో, లేదో చూడాలని ఒకడు ఆగాడు
యేసును తరువాత చూస్తానని ఒకడన్నాడు.
తనకెన్నడు కుష్ఠరోగం లేనట్టు ఒకడు తీర్మానించుకున్నాడు.
తానెలాగో బాగుపడియుండే వాడేనని ఒకడన్నాడు
ఒకడు యాజకులను మహిమపరచాడు
''ఓ; యేసు నిజంగా ఏమిచేయలేదని'' ఒకడన్నాడు
''రబ్బీలలో ఎవడైనా ఈ పని చేసేవాడే'' యని ఒకడన్నాడు.
''నాకు అంతకు ముందే చాలా నయంగా ఉంది'' అని ఒకడన్నాడు.[7]

''ఈ అన్యుడు తప్ప దేవుని మహిమపరచుటకు తిరిగి వచ్చినవాడెవడును అగపడలేదా? అని'' (18b వ.) ప్రభువైన యేసు విచారంతో అడిగారు. ''అన్యదేశీయుడని'' తర్జుమా చేయబడిన ఈ పదం- అన్యజనుల ఆవరణంలో నుండి స్త్రీల ఆవరణంలోనికి ప్రవేశించే ద్వారమందు వ్రాయబడియుంటుంది. ''మరో దేశానికి చెందిన వాడెవ్వడూ అడ్డును, కంచెను దాటి లోనికి ప్రవేశింపకూడదు. ఎవడైనా అలా ప్రవేశించినట్టు పట్టుబడ్డాడంటే మాత్రం, తన మరణం తన్ను వెంబడిస్తుంది, దానికతడే నిందితుడు''. గనుక ఇతడు దేవాలయంలోని సరియైన స్థలానికి వెళ్లలేక పోయాడుగాని, యితడు ప్రభువు నొద్దకు కృతజ్ఞతతో తిరిగి రాగలిగాడు!

తన కాళ్లమీదపడి మ్రొక్కుతున్న సమరయుని వైపు ప్రభువు తిరిగి, '' - నీవు లేచిపొమ్ము, నీ విశ్వాసము నిన్ను స్వస్థపరచెనని వానితో చెప్పెను'' (19a వ.). ''నీ విశ్వాసము నిన్ను స్వస్థపరచెనని ప్రభువైన యేసు అన్నప్పుడు,'' బహిరంగంగా తెలియబడగలిగిన సంగతినే ఆయన చెప్పియుండవచ్చు. అతడు కృతజ్ఞత కలిగియున్నందున ఆయన వానిపై ఒక ప్రత్యేకమైన దీవెనను సహితం రాజేసియుండ వచ్చు. కృతఘ్నులైయున్న తొంబండుగురు యూదులకు కూడా ఆయన భౌతిక స్వస్థత రాజేసెను గదా! ఆది భాషలో ఈ లేఖనభాగం - ''నీ విశ్వాసము నిన్ను రక్షించెను'' అని వ్రాయబడిందట. నీ విశ్వాసం ద్వారా, కృతజ్ఞతాస్తుతులు చెల్లించుట ద్వారా,

అంటే నీవు వాటిని ప్రదర్శించిన విధానంద్వారా శారీరకంగాను, ఆత్మసంబంధంగాను నీవు బాగుపడితివి'' అని ప్రభువైన యేసు చెప్పినట్టు అర్థమౌతుంది. మరో విధంగా చెప్పాలంటే, ''నీ యింటికి రక్షణ వచ్చియున్నది'' (లూకా 19:9)! అన్నట్టు ప్రభువు మాటలున్నాయ్.

## మన దినాల్లో కృతఘ్నత (లేక మేలు మరచుట)

ఈ సంఘటనలో మనం ఒక పక్షంగా నిలిచి లెక్కలు కట్టజూచాం. 10 మందిలో ఒక్కడు మాత్రమే ప్రభువైన యేసుకు కృతజ్ఞతాస్తుతులు చెల్లింప తిరిగి వచ్చాడంటే అది కేవలం 10 శాతం మాత్రమే! దానికి మనం దిగ్భ్రాంతి చెందాం. మనం యిక్కడ ఆగి ఆలోచన చేద్దాం. ఈ దినాల్లో అంతకంటె ఎక్కువ శాతం ఏదైనా వుందా? (పరిశీలన చేసికొంటేనే సంగతి బయటపడుతుంది).

కృతఘ్నత అనేది భయంకరమయ్యిందని మనకందరికి తెలుసు. అయితే ఈ జ్ఞానం మనమీద ఎంతవరకు ప్రభావం చూపుతుందో? కొన్ని సంవత్సరాల క్రిందట జరిగిన ప్రచురణలో, ''కృతఘ్నత'' (అంటే కృతజ్ఞత లేకపోవుట)ను గూర్చి ఒక పేజీ పూర్తిగా ఉదహరించబడింది. ఆ పేజీ నడుమ ''కృతఘ్నత'' అనే బ్రహ్మాండమైన పటం వేయబడింది. దాని చుట్టు జనులు నిలిచి, ఆ బొమ్మపైన రాళ్లువిసురుతున్నారు. నేను దాన్ని పరికించి చూచినప్పుడు, ఆ జనసమూహంలోని ప్రతివాడు తన చేతిలో ''కృతఘ్నత'' అనే పేరుతో బొమ్మను పట్టుకొని యున్నాడు. ఇతరుల జీవితాల్లోని ''కృతఘ్నతను'' మనం అడ్డగించి, దానికి విరోధంగా కేకలు వేసినా, మనమందరం రహస్యంగా ఈ అపకారం చేసే లక్షణాన్నే మన హృదయాల్లో దాచుకొంటున్నట్టు, ఆ కార్టూనిస్ట్ చిత్రించాడు. పదిమందిలో ఒక్కడు కృతజ్ఞతాస్తుతులు చెల్లించడానికి యేసునొద్దకు తిరిగి వచ్చిన సంఘటనను చదివేటప్పుడు, మనలో ప్రతి ఒక్కడు ఈ ప్రశ్నడుగుకోవాలి? ''నేను ఏ మేరకు కృతజ్ఞత కలిగి యున్నాను?''

కృతజ్ఞత కలిగియుండడాన్ని గూర్చి బైబిలు గట్టిగా నొక్కి పలుకుతుంది:

> క్రీస్తు అనుగ్రహించు సమాధానము మీ హృదయములలో ఏలుచుండ నియ్యుడి, ఇందుకొరకే మీరొక్క శరీరముగా పిలువ బడితిరి; మరియు కృతజ్ఞులై యుండుడి (కొలస్సీ 3:15).
>
> ప్రార్థనయందు నిలకడగా ఉండి, కృతజ్ఞతగలవారై దానియందు మెలకువగా ఉండుడి (కొలస్సీ. 4:2).
>
> ప్రతి విషయము నందును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి. ఈలాగు చేయుట యేసుక్రీస్తునందు మీ విషయములో దేవుని చిత్తము (1థెస్స.5:16-18).

''ప్రతి విషయమునందును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి'' అనేది ఎంతో సవ్వాలుగా వుంది? మనం ఎల్లవేళలా ఏదో ఒక దాని విషయంలో కృతజ్ఞత కలిగియుండ

బద్ధులమే. ఏ పరిస్థితిలోనైనా, మంచిని గుర్తించి, ఎల్లవేళల దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించే ఒక మనుష్యుని గూర్చి యిలా చెప్పబడింది. ఒక రోజు భయంకరమైన శీతాకాలపు తుఫాను వచ్చిందట. సమస్తం మంచుతో, వడగండ్లతో, జారుడు మంచుతో, మందమైన పొరగా కప్పబడిందట. కరెంటుపోయింది వాహనాలన్నీ ఎక్కడివక్కడే స్తంభించిపోయాయ్. ఇతనితోపాటు కొద్దిమంది మాత్రమే ప్రార్థనా కూడికకు చేరగలిగారట. జరిగిన దానిలో ఏ మంచిని గుర్తించి దేవునికి దాని విషయమై కృతజ్ఞతాస్తుతులు అతడు చెల్లిస్తాడో చూద్దామని ఆ తక్కినవారు కనిపెట్టియున్నారట. ప్రార్థించడానికి తన వంతు వచ్చేసరికి, ''ప్రభువా, వాతావరణం ఎల్లవేళలా యిలాగే ఉండదు గనుక నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తున్నాం!'' అని అతడు ప్రార్థించాడట! (ప్రతి సంఘటనలో మేలైనదేదో అతడు చూడగలుగుతాడు!! దానికి అతడు కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తాడు. ఆశ్చర్యంగా ఉండలేదా?)

ప్రతి విషయంలో మేలైనదేదో ఒకరు మనకు చూపించనవసరం ఏర్పడుతుంది. ఉదా: అది కృతజ్ఞతాస్తుతులు చెల్లించే దినం. అంకుల్ మార్ట్‌తోపాటు కుటుంబమంతా ఒకచోట కూడింది. వారు భోజనం చేయకముందు, వారేవిషయంలో కృతజ్ఞత కలిగియున్నారో, దాని కొరకు దేవునికి స్తుతి చెల్లిస్తూ వస్తున్నారట. మార్ట్ దగ్గరకు వరుస వచ్చేటప్పటికి, అతడు ''దాటి పోనీ'' (అంటే నా తరువాత వాడిని చేయమను) అని అన్నాడు. తన తరువాత కూర్చున్నవాడు దాన్ని దాటిపోనియ్యలేదు. ''ఒక నిమిషం'' ఆగు. అంకుల్ మార్ట్, నీవు దేని విషయంలో కృతజ్ఞత కలిగియున్నావో, అది మాకు చెప్పాలి అని అడిగాడట. మార్ట్ - నిట్టూర్చి, ''నేను కృతజ్ఞత చెప్పడానికి ఏదీలేదు'' అని అన్నాడు. ఆ పిల్లాడు, బల్ల మధ్యనున్న బంగారు గోధుమ వన్నెలో ఉన్న పక్షిని చూచి, ''నీవు ఆ టర్కి (మాంసం) కొరకైనా కృతజ్ఞత చెప్పవచ్చునే!'' అని అన్నాడట! మనలో అనేకుల పరిస్థితి యిలాటిదే.

కృతజ్ఞతాస్తుతులు చెల్లించే (మరొక) దినాన, కళ్లజోడు పెట్టుకున్న పిల్లవాడు - ''నా కండ్ల జోడు కొరకు నేను కృతజ్ఞత కలిగియున్నానని'' తెలిపాడు. ''అవి చూడడానికి సహాయం చేస్తాయనా?'' అని ఒకరు ఆ బాబును అడిగారు. ''కాదు, మగపిల్లలు నాతో దెబ్బలాడకుండను, ఆడ పిల్లలు నన్ను ముద్దాడకుండను, ఇవి సహాయం చేస్తాయి గనుక'' అని పిల్లవాడు బదులిచ్చాడట! మనం ఎల్లవేళల ఏదో ఒక దాని విషయంలో కృతజ్ఞత కలవారమై యుండాలి! అయితే మనం ఎంతవరకు కృతజ్ఞత కలిగియున్నామో?

కృతఘ్నత (కృతజ్ఞత చూపని) అనే పాపాన్ని గూర్చి బైబిలు మాట్లాడుతుంది. పౌలు తన దినాల్లో ఉన్న మనుష్యుల యొక్క దుస్థితిని గూర్చి మాట్లాడుతూ యిలా వ్రాశాడు: ''మరియు వారు దేవుని నెరిగియు ఆయనను దేవునిగా మహిమపరచలేదు, కృతజ్ఞతాస్తుతులు చెల్లింపను లేదు'' (రోమా 1:21). ఆ తరువాత తనకు ముందున్న

దినాల్లోని దుఃఖకరమైన మానవ స్థితిని గూర్చి అతడు మాట్లాడుతూ, ''ఏలయనగా మనుష్యులు స్వార్థప్రియులు, ధనాపేక్షులు, బింకము లాడువారు (తమ్మునుగూర్చి గొప్పగా చెప్పుకొనేవారు), అహంకారులు, దూషకులు, తల్లిదండ్రులకు అవిధేయులు కృతజ్ఞతలేనివారు'' అని వ్రాశాడు (2 తిమోతి 3:2).

ఒక కట్టు కథ యిలా చెప్పబడింది. నరుల ప్రార్థనలను సమకూర్చుకొని వచ్చేలా ఇద్దరు దేవదూతలు పంపబడ్డారట. మనుష్యుల మనవులతో తన గంపను నింపు కొనడానికి ఒక దూత, వారి కృతజ్ఞతాస్తుతులను సమకూర్చడానికి మరోదూత నియమించబడ్డారట. కొంతకాలం తరువాత వారిద్దరు దేవుని సింహాసనం వద్దకు వెళ్ళారట. మొదటివాని గంపేమో మానవ కోర్కెలతో నిండి పొర్లిపోతూ ఉందట. రెండవ దూతయొక్క గంప దాదాపు ఖాళీదేనట, అతడు భారభరితమైన హృదయంతో వచ్చాడట.

అటు నరులకుగాని, యిటు దేవునికిగాని ''కృతఘ్నత'' అనే కథలను ఎన్నైనా చెప్పవచ్చు. అనేక సంవత్సరాల క్రితం, మనుష్యులు ప్రయాణం చేసే ఒకఓడ జనులతో క్రిక్కిరిసి, మిచ్చిగాన్ సరస్సునుండి తడబడుతూ కష్టంగా వెళ్లిందట. ఎడ్‌వార్డ్ స్పెన్సర్ అనే ఒక విద్యార్థి ఆ తీరం మీద ఉండి, ఇసుక దిబ్బపై అలలు కొట్టుకొంటున్నచోట ఒక స్త్రీ, పగిలిన ఓడ ముక్కను పట్టుకొని వ్రేలాడడం చూచాడట. అతడు తన కోటును లాగిపడవేసి, బలమైన అలలకు విరోధంగా ఈదుకొంటూపోయి, చివరికి ఆమెను ఒడ్డుకు తెచ్చాడు. ఆ తరువాత పదహారు సార్లు ఆ అలలను దాటుకొంటూ, మొత్తం మీద పదిహేడుగురిని తప్పించాడు. దానితో అతడు అలసి, కూలిపోయాడు. దాని ఫలితంగా తన మిగిలిన జీవితమంతా, అనారోగ్యంతో అతడు గడిపాడు. చాల సంవత్సరాల తరువాత, అతని మరణపు నోటీసు వెలువడింది. అందులో తనచే రక్షింపబడిన పదిహేడుగురిలో ఏ ఒక్కరైనా అతనికి కృతజ్ఞత తెలపడానికి రాలేదు అని వార్తా పత్రిక అంది.

ఇతరులకు తీర్పు తీర్చడం మనవంతు కాదు. మన అక్కర మనలను గూర్చి నదయ్యే ఉండాలి. అయితే ఉండవలసినంత కృతజ్ఞతగలిగి మనం ఉంటున్నామా? కొన్ని క్షణాలపాటు మనలను మనమే స్వపరీక్ష చేసికొందాం.

మన గృహాల్లో మనం ఉండవలసినంత కృతజ్ఞత కలిగియుంటున్నామా? 2 తిమోతి 3లో, పౌలు మానవ పాపాలను గూర్చి పట్టి వేసేటప్పుడు, తల్లిదండ్రులకు అవిధే యులన్న వెంటనే, కృతజ్ఞత లేనివారనడం - సంభవాల కలయిక మాత్రమే నంటావా? అది సంభవాల కలయికయే నేమో; అని నాకు తెలియదుగాని, నాకు ఒకటి మాత్రం తెలుసు. అదేమంటే మనలో అనేకులు తల్లిదండ్రుల యెడల కృతజ్ఞత లేనివారు. ఆయా సమయాల్లో మన జీవితాల్లో వారు మనలను అలక్ష్యం చేసియున్నట్లయితే, ఒక్క వారపు అలక్ష్యమే మనలను చంపియుండేది. మన బాల్య దినాల్లో ప్రతిదానికి

మనం తల్లిదండ్రులపైన ఆధారపడియున్నాం. ముసలి తనంలో ఉన్న తల్లి అనేక పర్యాయములు రోత అనిపించినందున, యవ్వనులు ఆమె ఋణం తీర్చుకోకుండనే పోతారు. షేక్ స్పియర్ లోని కింగ్ లీయర్, తన విషాద అంతంలో - ''సర్పపు కోరకంటె కృతజ్ఞతలేని కుమారుని కలిగియుండటం ఎంతో పదునుగావుంది!'' అని అన్నాడు.

మన సాటివారిపట్ల కలిగి యుండవలసినంత కృతజ్ఞత కలిగియున్నామా? మన తోటి వారియెడల చూపే కృతఘ్నతను గూర్చి ఆలోచించేటప్పుడు, అనేక బైబిలు ఉదాహరణలు మనస్సునకు వస్తాయి. లాబాను తన అల్లుడైన యాకోబు యొక్క ప్రయాసలను అభినందించలేకపోయాడు (ఆది. 31:6-7). పానదాయకుల అధిపతి చెరసాలలోని యోసేపును మరచిపోయాడు (ఆది. 40:23). తమ్ముసు (ఐగుప్తు బానిసత్వం నుండి) విడిపించిన మోషేను ఇశ్రాయేలీయులు రాళ్లతో కొట్ట సిద్ధపడ్డారు (నిర్గమ. 17:1-4). తన ప్రాణాన్ని విడిచిపెట్టిన దావీదును సౌలు యింకా చంపవెదికాడు (2 సమూ. 16:1-2). (ఇంకా యిలా అనేకాలు చెప్పవచ్చు).

మనలో ప్రతి ఒక్కరు అనేకులకు గొప్ప రుణస్థులమై యున్నాం. వారు స్నేహితులే కావచ్చు, లేక క్రీస్తునందు సహోదర సహోదరీలే కావచ్చు, మన ప్రాణాలను దక్కించి నందుకు మనలో అనేకులం వైద్యులకు, శస్త్ర చికిత్స చేసిన వారికి రుణస్థులం. ''వందనాలు'' అని వారికి చెప్పియున్నామా? అది అత్యాలస్యం కాకముందే ఆ పని చేద్దాం.

కృతజ్ఞత కలిగి యుండాలనే విషయాన్ని మాట్లాడుతున్న ఒక సువార్తికుడు ఈ ప్రతిపాదన చేశాడు: ''పరలోకంలో టెలీఫోన్లులేవు'' (ఈ వాస్తవమే అక్కడికి వెళ్లాలనే కోర్కెను కలిగిస్తుంది!). ఇందులో తన ఉద్దేశమేమంటే, ఎవరైనా దాటిపోతే, ''నీకు వందనాలు'' అని నీవు అతనికి చెప్పే అవకాశం ఉండదు. ఉదాహరణకు, బిల్ అనే ఒక స్నేహితుడు నాకెంతో ఉపకారం చేశాడు; నేనతనికి తగినట్టు కృతజ్ఞతలు తెలుపలేదని అనుకుందాం. అతడు చనిపోయిన తరువాత, నేను ఫోను చేతపట్టుకొని ''మిక్కిలి దీర్ఘమైన దూరం నా ఉద్దేశం, మిక్కిలి దీర్ఘమైన దూరం యివ్వు, నేను పరలోకంలో బిల్‌తో మాట్లాడాలి. బిల్! యిది నీవా? నీకు వందనాలు చెప్పడానికి పిలిచానులే!'' అని అనగలమా?

కొన్నిసార్లు సమాధి చేయబడేటప్పుడు పెట్టెలో ఉన్న మృతదేహంతో - ''నేను నిన్ను ప్రేమిస్తున్నాను!'' ''నేను నిన్ను అభినందిస్తున్నా!'' ''నీ విషయమై లక్ష్యపెడుతున్నా''నంటూ సజీవంగా ఉన్నప్పుడు చెప్పని మాటలు అప్పుడనడానికి ప్రయత్నిస్తారు జనులు!

విపరీతమైన బుద్ధిగల ఒక టెక్సాస్‌లోని వ్యాపారి, తనయొద్ద వాడుకగా కొనే తన స్నేహితునికి యివ్వడానికి ఒక పుస్తకం ముద్రించాడట. అట్టమీద పదిలక్షల వందనాలు

అనే పేరుపెట్టాడట. లోపల ''వందనాలు'' అనే పదాన్ని పదిలక్షల సార్లు ముద్రించాడు. మనకు సహాయపడి, మనలను ప్రోత్సాహించిన వారికందరికి మన అభినందనలు వ్యక్తపరచడానికి మనలో ఎక్కువ మందికి పదిలక్షల ''వందనాలకు'' మించే అవసరమై యుంటాయి; కదూ?

''అలా చెప్పు'' అనే తలరాత క్రింద, గెరాల్డ్డైన్ సీర్ఫన్ ఈ క్రింది వరుసలను వ్రాశాడు:

పొరుగువాడొక చిన్న సహాయం చేశాడా,
నీవు వెళ్లే మార్గంలో నీతోకూడ -
నీ భారాన్ని తేలిక చేయడానికి సహాయపడ్డాడా?
అప్పుడు నీవు అతనికి ఆ సంగతి ఎందుకు చెప్పవు!

కలిపి ఆడించిన చేయి నిన్ను లేవనెత్తినట్టుంటే
శ్రమ బాధల యొక్క లోతులలో నుండి,
పురాతన స్నేహితుడొకడు నీ దుఃఖాన్ని పంచుకొంటే?
అప్పుడు నీవు అతనికి ఆ సంగతి ఎందుకు చెప్పవు!

నీ పరలోకపు తండ్రియు ఇయ్యగా నీకు
అనేక దీవెనలు యిక్కడ ఈ నేలపై?
అప్పుడు ఆయన ఎదుట వంచబడిన మోకాలుపై
యథార్థంగా, సంతోషంగా ఆయనకాలాగు చెప్పు![8]

స్వపరీక్ష అనే అతి ప్రాముఖ్యమైన భాగానికి యిది మనలను తెస్తుంది. దేవునికి మనం ఉండవలసినంత కృతజ్ఞత కలిగియున్నామా? దేవుడనుగ్రహించు సమస్త దీవెనలకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించక పోవడమే మన పతనాల్లో గొప్ప పతనమై యుంది. ''నా ప్రాణమా, యెహోవాను సన్నుతించుము. ఆయన చేసిన ఉపకారములలో దేనిని మరువకుము'' అని కీర్తనల రచయిత అన్నాడు (కీర్తన 103:2). కీర్తనల రచయిత మాట్లాడుతున్న ఉపకారాలేవి? మత్తయి 5:45 లో చెప్పబడిన ఆలోచనతో మనం దీన్ని ప్రారంభించుదాం. ''ఆయన చెడ్డవారి మీదను మంచివారి మీదను తన సూర్యుని ఉదయింపజేసి, నీతిమంతుల మీదను, అనీతిమంతుల మీదను వర్షము కురిపించుచున్నాడు.'' మనకు సూర్య ప్రకాశం, వర్షం అనేవి అనుగ్రహించబడు తున్నాయ్. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు; పువ్వులు, వృక్షములు, పక్షులు; యాపిల్స్, గుడ్లు, వేరుశనగ, వెన్న వగైరాలు ఉన్నాయి. మనకు మన దినచర్యలు, లేక వాడుకయైన కార్యక్రమాలున్నాయి.

వాటితోపాటు, ప్రభువైన యేసు ఆ సమరయునికి యిచ్చినట్టు, మనకున్న ప్రత్యేకమైన మేలేమో! ''ఆయన మీకొరకు ఎన్ని గొప్ప కార్యములను చేసెనో అది మీరు తలంచు''కొనుడి (1 సమూ. 12:24). నీవు ఎప్పుడైన రోగివై తిరిగి

బాగుపడియుంటివా?[9] నీవు క్రైస్తవ గృహములో పెంచబడ్డావా? నీవెప్పుడైనా సువార్తను విని, గ్రహించి, లోబడియున్నావా? ప్రభువును ప్రేమించే వ్యక్తిని నీ వివాహపు జంటగా కనుగొన్నావా? దేవుని పరిశుద్ధులలో కొందరు గొప్పవారిని ఎరిగిన భాగ్యం కలిగియున్నావా? దేవుడు నీకు బిడ్డలననుగ్రహించాడా? చేయగల అతికష్టమైన అంకగణితం తన దీవెనలను లెక్కించ గలుగుటయేనని ఒకరన్నారు.

అన్నింటిని మించి, ''చెప్ప శక్యము కాని ఆయన వరము'' అని పౌలు అన్నాడే, దాని విషయమై మనము దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లింప బద్ధులమై యున్నాము (2 కొరింథీ. 9:15). రెండవ ప్రపంచ యుద్ధంలో ఇంగ్లాండును కాపాడిన రాయల్ విమాన దళపు యువకులను విన్స్టన్ చర్చిల్ శ్లాఘించినప్పుడు - ''ఇంత కొద్దిమందికి మానవ చరిత్రలో ఎన్నడూ యింత ఎక్కువమంది యింత ఎక్కువగా రుణపడి యుండలేదు'' అని అన్నాడు, ఈ మాటలు ప్రభువైన యేసు పట్ల అంతకంటె ఎక్కువ సత్యమైనవి: ''ఒకే ఒక వ్యక్తికి, ఈ మహా విశ్వంయొక్క చరిత్రలో ఎన్నడూ యింత ఎక్కువమంది యింత ఎక్కువగా రుణపడియుండలేదు!''

ప్రభువు మనపట్ల జరిగించిన వాటికన్నిటికి మనమెంత కృతజ్ఞత కలిగి యుండాలో? మనం కృతజ్ఞత కలిగియుంటే, మన కృతజ్ఞతను వ్యక్తపరచేదెలాగు? ప్రభువు బల్ల చుట్టు మనం చేరినప్పుడు - ''ఆ తొమ్మండుగురు ఎక్కడ?'' కానుకల పెట్టి మనముందు దాటి పోయేటప్పుడు - ''ఆ తొమ్మండుగురు ఎక్కడ?'' ప్రభువును ఘనపరచడానికి ఆదివారం సాయంకాలం, బుధవారం సాయంకాలం కూడి వచ్చేటప్పుడు - ''ఆ తొమ్మండుగురు ఎక్కడ?'' మన దీవెనలన్నిటిలో రక్షణయనే అత్యధికమైన దీవెనను యితరులతో పంచుకొనడానికిగాను గృహాలు దర్శించే, లేక సువార్తకు వెళ్లే సమయంలో, ''ఆ తొమ్మండుగురు ఎక్కడ?''

దేవుడు నీకు చేసిన వాటన్నిటిని గూర్చి ఆలోచించడానికి కొన్ని క్షణాలు గడిపి, ఆ తరువాత ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించు. ''ఆ తొమ్మండుగురు ఎక్కడ?'' అని అడిగే భారభరితమైన ఆయన హృదయాన్ని విడిచి వెళ్లకు. (ఆయన నీ కృతజ్ఞత హృదయాన్ని ఆనందంతో అంగీకరిస్తాడు).

## ముగింపు

ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించడానికి ఆచరణయోగ్యమైన మార్గమేదంటే: ఆయన నీకు ఆజ్ఞాపించినట్టు జరిగించడమే. ఒకవేళ నీవు బాప్తిస్మం పొందవలసి వచ్చినా లేక త్రోవ తప్పిన దేవుని బిడ్డగా నీవు పునరుద్ధరింప బడవలసి వచ్చినా ఆ అవసరతను వెంటనే ఎందుకు తీర్చుకోకూడదు? ప్రభువు నీకు చేసినదంతా నిజంగా నీవు అభినందించే వాడవైతే, ఆ పని చేయడానికి నీవు జాగుచేయవు, లేక వెనుకాడవు.

## నశించినవారిని వెదకుట

ప్రభువు యొక్క పరిచర్య ''నిరీక్షింపదగిన'' వారి పట్ల బహు ఆశ్చర్యకరమయ్యింది. పన్నెండు మంది అపొస్తలులలో ఒకనిగా ఆయన సుంకరియైన మత్తయిని ఎన్నిక చేసికొన్నారు. గత జీవితంలో ఐదుగురు భర్తలున్న స్త్రీకి బావియొద్ద బోధించారు. ఆయన జక్కయ్య యింట భోజనం చేశారు. సువార్త సందేశం వలన మార్చబడగలరని మనం తలంచే పట్టీలు ఎంత వ్యత్యాసంగా ఉంటాయో! నశించిన దానిని వెదకడంలో ప్రభువు నొద్దనుండి మనం నిజంగా పాఠాలు నేర్చుకున్నామా?

తన జీవితపు లక్ష్యమేమో ప్రభువుకు తెలుసు: ''నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెను'' (లూకా 19:10). దేవా, ప్రభువైన యేసు తన పనిలో ఉన్నట్టు, మా పనిలో మేముకూడా తేటగా ఉండేలా, మాకు సహాయం చేయండి! అని ప్రార్థించుదాం.

---

సూచనలు

[1]లూక 9:51; 13:22.

[2]లేవీ. 13:46; సంఖ్యా. 5:2-3.

[3]యోహాను 4:9.

[4]''కుష్ఠరోగమని'' బైబిలు చేసిన పద ప్రయోగం, నేడు మనం వాడే దానికంటే, ఎంతో విశాలమైనదిగా నేను గ్రహిస్తున్నాను.

[5]లేవీ. 14:2.

[6]సమరయులు (ధర్మశాస్త్రాని నమ్మేవారు) పాతనిబంధనలోని మొదటి ఐదు పుస్తకాలను నమ్మేవారు. దానిలో కుష్ఠరోగాన్ని గూర్చిన చట్టాలు యిమిడి ఉన్నాయి.

[7]కఫ్‌మన్, 341.

[8]Quoted by Eleanor Doan in *The Speaker's Sourcebook* (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1962), 262.

[9]తాము పొందిన ''ప్రత్యేకమైన'' దీవెనలను గూర్చి శ్రోతలను పట్టీ తయారుచేయమని అడుగవచ్చు, మన పాఠంలోని పట్టీకి వారిపట్టీ భిన్నంగా ఉండవచ్చు.